




# మహా యిల్లాలు

కొడవటిగంటి కుటుంబరావు

రోశాం యానాది పిల్ల. చిన్నతనంనుంచీ మా యిళ్ళలోనే పెరిగింది. అస్తమానం మా యిళ్ళలోనే ఉండేది. గుడిసెకుపోతే చుట్టపుచూపుగా ఏమన్నాపొయ్యేదేమో. మాయింటో, తప్పితే సీతయ్యగారింటో, తప్పితే కోమటిదుకాణంమీద. మరోచోటికిపోయి ఎరుగదు. ఈ మూడిళ్ళలోనూ పనిచేసేది. మూడిళ్ళలోనూ తిండితినేది. రాత్రిపూట ఎవరో ఒకరిపంచన పడుకునేది.

'చేసుకున్న అమ్మకు ఒకటేకూర, అడుక్కున్న అమ్మకు అన్ని కూరలే,' అనేది మా అమ్మ.

'చిన్నతనం. నిర్విచారంగావుంటుంది.




ఏ పని చెప్పినా ఆడుతూ పాడుతూ చేస్తుంది,' అనేది సీతయ్యగారి పెళ్ళాం.

'ఏ జనమలోనో పాపంజేసి సూద్ర రాళ్ళయి పుట్టటంగాని, అసలు ఆళ్ళ కున్నసుకం మన కేణ్ణించొస్తుందీ!' అనేది కోమటావిడ.

రోశాం అంట్లుతోమేది, దొడ్డిఊడ్చేది, బజారుకెళ్ళి అదీ ఇదీ పట్టుకొచ్చేది, బట్టలు ఉతికేది. అది ఉతికినబట్టలమీద నాలుగుచుక్కలు పవిత్రోదకం చల్లి మావాళ్ళు ఆరేసుకునేవాళ్ళు.

ఏ కారణంచేతనన్నా రోశాం ఒక రోజు రాకపోతే మావాళ్ళకి చాకిరి ఎంత చేసినా తెమిలేదికాదు. అయితే ఏం, దాన్ని అందరూ ఎంతో ఆపేక్షగా చూసే వాళ్ళు.

మేం దానికి నెలకి పావలా ఇచ్చే వాళ్ళం. సీతయ్యగారు యింకో పావలా అల్లా ఇచ్చేవాడు. కోమటాయన ఏమీ ఇయ్యకపోయినా రోశాం తల్లికి ఎప్పుడన్నా ఓ దమ్మిడీ ఉప్పుపెట్టేవాడు. రోశాం తండ్రికి ఒకటీ రెండూ అప్పు పెట్టి నెలకు రూపాయికి అణాకంటె వడ్డీ తీసుకునేవాడు కాడు. వ్యాపారం చేసుకునే వాళ్ళకిమటుకు అభిమానాలుండవెట్టా?

ఎప్పుడన్నా మా యిళ్ళల్లో బొత్తిగా చిరిగిపోయిన బట్టలుంటే, అవతల పారెయ్యకుండా దానికే ఇచ్చేవాళ్ళం. తిండిపెడుతూనే ఉంటిమాయె, ఇకదానికి ఖర్చేముందీ? ఏడాదికి నికరంగా ఆరు రూపాయలూ వెనకేసిందన్నమాటే. ఈ లెక్కచూసి ఒకసారి కోమటావిడ విరుచుకుపడిపోయినంత పనిచేసింది.

రోశాం తండ్రి వొట్టి పాపిష్టిముండా కొడుకు, తాగేసేవాడు. అందుచేత దాని తల్లి, కూతురి జీతండబ్బులు మావాళ్ళ దగ్గిరే దాచుకుని అవసరమైనట్టు తీసుకునేది.

భగవంతుడు అటువంటివాళ్ళను కని పెట్టిఉంటాడు గామాలు రోశాం ఎన్నడూ

మంచానపడి ఎరగదు. ఎప్పుడన్నా తల నొప్పి, జ్వరమూ వచ్చినా దానికి లెక్క లేదు. అందుచేత దానిచేత మామూలు ప్రకారం పనిచేయించుకొనేవాళ్ళం. అది కూడా ఎంత జ్వరమైనా ఖాతరు చెయ్య కుండా మామూలు పనులన్నీ చేసేది.

మా నాన్నగారు డాక్టరై ఉండికూడా ఇంటో మా కొచ్చే రోగాలకు మందివ్వ టానికి విసుక్కునేవారు. 'ఆ ముండను చూడండ్రా, దానికేం మందుకావాలి ? అన్ని మందులూ మనకే!' అనేవారు.

తక్కువకులంది గనక, ఏ వస్తు వన్నా చప్పున కనిపించకపోతే సహ జంగా, 'ఆ రోశాంముండ ఎత్తుకుపోయిం దేమో,' అని అనుకునేవాళ్ళమన్న మాటే గాని అది ఎన్నడూ యదార్థంగా దొంగ తనంచేసి ఎరగదు. ఇంటో ఉండే వెండి సామానూ, నగలూ, అక్కడక్కడా పెట్టిన చిల్లరడబ్బులూ, అది ఎన్నడూ ముట్టుకోకపోగా జాగర్త చేసిపెట్టేది కూడానూ. అటువంటిబుద్ధి పనిచేసే వాళ్ళలో అరుదు.

పెళ్లయేవరకూ రోశాం మా యిళ్లలో పనిచేస్తూనే ఉందనుకోండి. దానికి పెళ్ళ యితే మా యింటో మనిషికి పెళ్ళయి నట్టేఉంది, అమ్మ దానికో రూపాయిన్నర చీరా, నాలుగణాలు గుడ్డకూడా పెట్టింది. పెళ్ళయిన ఏడాదికల్లా అది పిల్లాణ్ణెత్తు కొస్తే అమ్మ మళ్ళీ పిల్లాడిచేతిలో అణా పెట్టింది.

'నువ్వెళ్ళావు, మళ్ళీ యింటికి అను వయిన పనిమనిషి దొరకలేదే!' అన్నది అమ్మ.

'అదేం దమ్మగారూ!' అన్నది రోశాం ఆదుర్దాగా.

'ఆఁ! అంతా, రూపాయిస్తావా? రెండి స్తావా? అని అడిగేవాళ్ళేనే! రూపాయలు పోగేసుక్కూచున్నామా?' అన్నది అమ్మ.

'రోజులు మా కుండిపోతాన్న య్యమ్మా,' అన్నది రోశాం...

రోశాం మొగుడు మా వూళ్ళో చేర టంతో రోశాం మళ్ళీ మాకు దగ్గిరయింది. పనిలోకి వస్తుందేమోనని ఆశపడ్డాం కూడా, కాని రోశాంమొగుడు అదోరకం మనిషి దానికి తగ్గవాడుకాదు. వాడికి పొగరు. మేమంతా డబ్బున్నవాళ్ళమని వాడికి కడుపుమంట. తనకూ్కడా మేడలూ మిద్దెలూ లేవని ఏడుపేమో! అందుచేతే వాడికి ఎక్కడా కుదురుగా నౌకరీ చేసుకునే గీతలేదు. రోశాంవంటి మంచిముండకు అటువంటి నిర్భాగ్యుడు దొరకటం చాలా విచారకరం...

మంచివాళ్ళకి కాలంకాదు. అందు చేతనే రోశాం, పాపం, అన్ని ఇక్కట్లు పడ్డది. ముందు దాని మొగుడికి ఉద్యోగం పోయింది ఏదో నాలుగురాళ్ళు తెచ్చు కుంటున్న వెధవ ఊరికేఉండగూడదూ! సమ్మెలుట, సమ్మెలు!




వాడికి ఓ చెంప ఉద్యోగంపోయి ఉన్న స్థితిలో రోశాం పెద్దపిల్లవాడికి రోగం వచ్చింది. ఇంటో ఏ పూటకూడా ఓ గింజలేదు. దానికా చాకిరీలేదు. ఎట్లా గడుస్తుందీ? ఎవరిస్తా రేమిటి? ఎందు కిస్తారు? రెక్కాడితేనే డొక్కాడుతుంది. పిల్లవాడికి మందూ మాకూ లేదు.

మా యింటో యింటిమనిషల్లే పెరిగిన పిల్ల ఇన్ని అగచాట్లు పడుతూంటే మాకు కష్టంగానే ఉంది మరి. కాని ఎవరిరాత ఎవరు తప్పిస్తారు గనకా? కాని అంత ఇబ్బందిలోనూ అది దేహి అని ఎవర్ని గానీ అడిగిందా? అదెంత మహా ఇల్లాలో! ఒక వేళ మేం ఇచ్చినా తీసుకుని ఉండేది కాదు. సందేహంలేదు.

కష్టాలు ఒంటరిగా రావుగదాని మొదట్లో దాని మొగుణ్ణి ఎరెస్టువేసి తీసుకుపోయినారు. మర్నాడే పిల్లాడు చచ్చాడు. ఆ తరవాత రోశాం మంచం పట్టిందని తెలిసింది. చూసేవాళ్ళు లేరు. కాచిపోసేవాళ్ళు లేరు. ఎంతకాలం బతుకుతుందీ?

'నీకీ పాడు ప్రపంచంతో రుణం తీరిపోయింది, నా వెంటరా,' అని భగవంతుడే దాన్ని తీసుకుపోయినాడు.

దానిపేర ఆ రెండో నలుసు మాత్రం బతికి ఉన్నాడు. వాణ్ణి ఎవరో దగ్గిరికి తీసి సాకుతున్నారుట. అన్నిటికీ ఆ భగవంతుడే దారి చూపిస్తాడు. భూమ్మీద నాలుగు మెతుకులు ప్రాప్తం ఉండాలేగానీ, ఏ దేముడో, ఏ ధర్మరాజో ఆదుకోకపోడు...

ఏమయినా అదిమాత్రం మహా ఇల్లాలు దానికి మళ్ళీ జన్మంటూ ఉండదు. అది పోయిందంటే మా మూడిళ్ళ వాళ్ళకీ మా సొంతమనిషి పోయినట్టే ఉందన్న మాట. అభిమానాలు గుణాన్నిబట్టి రావాలిగాని కులాన్నిబట్టి వస్తాయా ఏం?